
# హైదరాబాద్ వార్త



## జిహెచ్ఎంసి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇలంబర్తి

**హైదరాబాద్, అక్టోబరు 17,ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి నూతన కమిషనర్‌గా ఐఏఎస్ కె. ఇలంబర్తి బాధ్యతలు స్వీకరించారు. నిన్నమొన్నటివరకు కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆమ్రపాలి ఏపీకి రీలీవ్ కావడంతో ట్రాన్స్‌పోర్టు కమిషనర్‌గా పనిచేస్తున్న ఇలంబర్తికి ప్రభుత్వం అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈమేరకు గురువారం జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయానికి చేరుకున్న ఇలంబర్తికి జిహెచ్ఎంసి అధికారులు, స్వాగతం పలికారు. ఈసందర్భంగా నూతన కమిషనర్‌ను జోనల్ కమిషనర్లు హేమంత్ కేశవ్ పాటిల్, అనురాగ్ జయంతి, అపూర్వ్ చౌహాన్, అడిషనల్ కమిషనర్లు నళిని పద్మావతి, యాదగిరి రావు, వేణుగోపాల్‌రెడ్డి, సత్యనారాయణ, పంకజ, సిసిపి శ్రీనివాస్, సిపిఆర్‌వో మహ్మద్ ముర్తుజా అలీ, ఛీఫ్ ఎంటమాలజిస్ట్ రాంబాబు, రవి కిరణ్, వెంకన్న, ఓఎస్‌డి వేణుగోపాల్, ఆయా విభాగాల సీనియర్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.



నూతన కమిషనర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న వివిధ విభాగాల అధికారులు

## నగరంలో ట్రాఫిక్, హైడ్రా విభాగాల సంయుక్త సమీక్ష



**పంజగుట్ట, అక్టోబర్ 17 (ప్రభాతవార్త):** గురువారం నగర ట్రాఫిక్ అదనపు కమీషనర్ కార్యాలయంలో నగర ట్రాఫిక్ అదనపు కమీషనర్ విశ్వప్రసాద్, హైడ్రా కమీషనర్ రంగనాథ్‌లు సంయుక్తంగా సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షలో పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. నగరంలో ట్రాఫిక్ సమస్యలపై ట్రాఫిక్ విభాగంతో కలిసి పనిచేయాలని హైడ్రా నిర్ణయం తీసుకుంది. హైడ్రాకు చెందిన డీఆర్ఎఫ్ బృందాలకు ట్రాఫిక్ నియంత్రణపై శిక్షణ ఇప్పించాలని నిర్ణయం తీసుకున్నారు. భారీవర్షాలు, ప్రకృతి వైపరీత్యాలు లేని సమయంలో ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ పోలీసులతో కలసి హైడ్రా డీఆర్ఎఫ్ బృందం కలిసి పనిచేసేలా ఏర్పాట్లు.రెండు విభాగాలు కలసి పనిచేయాలని నిర్ణయం తీసుకున్నారు.వర్షం పడినపుడు వరదనీరు చేరే ప్రాంతాల్లో తక్షణ చర్యలు చేపట్టి నీటిని తొలగించేందుకు డీఆర్ఎఫ్ బృందాలతో ట్రాఫిక్ పోలీసులు కలసి పనిచేయడం.ఇరు శాఖలు గుర్తించిన వాటర్ లాగింగ్ పాయింట్‌ల వద్ద నీరు నిల్వకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్ష నిర్వహించారు. వెంటనే నీరు తొలగించేలా హార్స్‌పవర్ ఎక్కువ ఉన్న మోటార్ల వినియోగం, ఆ నీటిని ఎక్కడకు తోడాలో అనేదా నిపై చర్చ శాశ్తి పరిష్కారానికి క్షేత్రస్థాయిలో చేప ట్టాల్సిన కార్యక్రమాలపై దృష్టి,వరద కాలువలు, పైపుల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడం, కొత్త లైన్లను వేసి వరదకు శాశ్విత పరిష్కారం చూపడం లాంటి చర్యలు చేపట్టనున్నారు. ప్రధాన రహదారులతో పాటు కాలనీల్లో ఫుట్‌పాత్‌లను ఆక్రమించి ఉన్న శాశ్విత దుకాణాలను తొలగించడం, ఇందుకోసం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఫుట్‌పాత్‌లను, రహదారులను ఆక్రమించి దుకా ణాలను ఏర్పాటు చేసే వ్యాపారులకు సమాచారం ఇచ్చి వాటిని తొలగించాలని నిర్ణయం తీసుకున్నారు. హైడ్రా, జీఎచ్ఎంసీ, ట్రాఫిక్ విభాగాలు సంయుక్తంగా పనిచేసి నగరంలో ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా నగర ప్రజలు సాఫీగా నడుచుకునేలా చూడాలని అధికారులు నిర్ణయించారు. కూలడానికి సిద్ధంగా ఉన్న చెట్లను తొలగించాలని నిర్ణయించారు. ట్రాఫిక్ వరద నీటి సమస్యఉత్పన్నమైనపుడు ప్రాంతాలవారీ స్పందించే బృందాల సమాచారం ప్రజలకు తెలిసేలా ఏర్పాట్లు, ప్రజల భాగస్వా మ్యంతో ట్రాఫిక్ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ముందుకు పోవాలని సమావేశంలో నిర్ణయించారు. సమావేశంలో ట్రాఫిక్, హైడ్రా సిబ్బంది పాల్గొన్నారు.

## మెడి"కిల్" షాపులు..!



- -పేరొకరిది..షాప్ మరొకరిది
- -అద్దెసర్టిఫికేట్లతో వ్యాపారం
- -పరిజ్ఞానం లేనివారితో విక్రయం
- -పట్టించుకోని "ప్రిస్క్రిప్షన్" నిబంధన
- -పత్తాలేని డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు
- -మామూళ్ల మత్తులో ప్రజారోగ్యానికి తూట్లు



**హైదరాబాద్,అక్టోబరు 17,ప్రభాతవార్త:** ఇటీవల ఓమహిళ విపరీతమైన తలనొప్పితో రావడంతో మెడికల్ షాప్‌లో మాత్ర కొనుక్కుని వేసుకుంది. రెండుగంటల తర్వాత ఆమెకు వాంతులు కావడంతో అస్పత్రికి తరలించారు. సకాలంలో డాక్టర్ వద్దకు తీసుకపోవడంతో ప్రాణాపాయం నుంచి బయటపడింది. దీనికి షాపులో పనిచేసే వ్యక్తి బీఫార్మసీ చేసిన వ్యక్తి కాకపోవడం అవగాహన లేకపోవడం. గ్రేటర్‌లోని మెడికల్ షాపుల యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.. .ఓపక్క మందులదుకాణం, మరోపక్క క్లినిక్‌ను నడిపిస్తూ రెండు చేతులా సంపాదిస్తున్నారు. కార్పొరేట్ ఆస్పత్రికి వెళ్తే ఖర్చు ఎక్కువందని ఇక్కడికి వచ్చేపేద రోగులను అర్హతలేని వైద్యులతో పరీక్షలు నిర్వహిస్తూ వారి ఆరోగ్యంతో ఆటలాడుకుంటున్నారు. అద్దె సర్టిఫికేట్‌లతో లైసెన్స్ తెచ్చుకుని పరిజ్ఞానం లేని వ్యక్తులతో మందులు విక్రయం చేపడుతున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఇలాంటి వందలసంఖ్యలో ఉన్నాయి. ముఖ్యంగా బస్తీలు, శివారు ప్రాంతాలలో విచ్చలవిడిగా నడుస్తున్నాయి. వైద్యుడి ప్రిస్క్రిప్షన్ ఉంటేనే మందులు అందించాలనే ప్రభుత్వ నిబంధన ఉన్నా దానినెవరూ పట్టించుకోవాడం లేదు. తమకున్న బాధను చెప్పి మందులడిగిన వారికి నకిలీవి అంటగడుతూ పెద్ద మొత్తంలో డబ్బులు దండుకుంటున్నారు. అలాగే జనరిక్ మందులపై సైతం ఎక్కువ ధరకు విక్రయిస్తూ అక్రమాలకు పాల్పడున్నారు. అగిడిన వారికి తప్పరశీదులను కూడా ఎవరికీ ఇవ్వడం లేదు. వీటన్నింటిని పట్టించుకోవాల్సిన డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు పత్తా లేకుండా పోతున్నారు.

**పేరొకరిది..షాప్ మరొకరిది..**

మెడికల్ షాపు ఏర్పాటు చేయాలంటే ఫార్మసీ సర్టిఫికేట్ అవసరం ఉంటుంది. ఆసర్టిఫికేట్ ఆధారంగా అధికారులు లైసెన్స్‌జారీ చేస్తారు. వైద్యం వ్యాపారంగా మారిన క్రమంలో కొంతమంది ఫార్మసీ చేసి ఉన్నత చదువులు చదివేవారికి సంబంధించి ఫార్మసీ సర్టిఫికేట్లను అద్దెరూపేణ తీసుకుని లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. సర్టిఫికేట్‌లో ఉన్న పేరుతోనే లైసెన్స్ మంజూరవుతుంది. సదరు ఫార్మాసిస్టు షాపులో తప్పనిసరిగా ఉండి మందులు విక్రయించాల్సి ఉంటుంది. కానీ నగరంలోని చాలాషాపుల్లో అవగాహన లేనివారితో మందులను విక్రయిస్తున్నారు.

**చెలామణిలో నకిలీ..**

మెడికల్ షాపుల్లో మార్కెట్ ముందుల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి.వివిధ ప్రాంతాల్లో నాణ్యతా లోపంతో తయారు చేసిన వివిధ రకాల మందులను అమ్మేహోల్‌సేలర్లు అతితక్కువ ధరపై వీటిని రిటైలర్లకు సరఫరా చేస్తున్నారు. ఈమందుల ధరలు వారికి అసలు ధరకంటే 70శాతం నుంచి 50శాతం వరకు తక్కువతో సరఫరా అవుతాయి. వీటిని బ్రాండెడ్ మందుల ధరతో రోగులకు అంటగడుతున్నారు. ఈమందులనే డాక్టర్లు రాసేలా వారికి నజరానాలు అందిస్తున్నారు. వాస్తవానికి మెడికల్ షాపులకు సరఫరా అయ్యే మందులలో కొన్ని ముఖ్యమైన ముందులు "షెడ్యూల్ హెచ్" హెచ్చరికలతో సరఫరా అవుతాయి. అలాంటి మందులను డాక్టర్ ప్రిస్క్రిప్షన్ ఉంటేనే విక్రయించాలి. ఈమేరకు రిజస్టర్ మెయింటెన్ చేస్తే కొనుగోలు చేసిన మందులు ప్రతిరోజూ రిజిష్టర్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. ఎలాంటి ప్రత్యేక రిజిస్టర్లు మెయింటెన్ చేయడంలేదు. కొన్ని మెడికల్‌షాపుల్లో రాత్రి షాపు మూసే ముందు కొన్నిమందులకు సంబంధించి బిల్లులు కట్ చేస్తూ నిబంధనల నుంచి తప్పించుకుంటున్నారు.

**తూతూమంత్రంగా తనిఖీలు..**

నిత్యంమెడికల్ షాపులను తనిఖీలు చేయాల్సిన ఔషధ నియంత్రణశాఖ అధికారులు,యేడాదికి ఒక్కసారికూడా తనిఖీ చేయడం లేదు. ప్రతి మూడు నెలలకోసారి,ఆరునెలలకు,ఏడాదికి మామూల్లు అందుతుండటంతో చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారు.అన్ని సక్రమంగా ఉంటే అధికారులు మూమూళ్లు ఎందికిస్తున్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

## నిబంధనలకు విరుద్ధంగా సమావేశాలు నిర్వహిస్తున్న లాడ్జ్ సీజ్



సికింద్రాబాద్‌లో మెట్రో పొలిస్ లాడ్జ్‌ను సీజ్ చేస్తున్న రెవెన్యూ, పోలీస్ అధికారులు

**కంటోన్మెంట్,అక్టోబర్ 17 ప్రభాతవార్త:** నిబంధనలకు విరుద్ధంగా లాడ్జ్‌లో మతపరమైన సమావేశం నిర్వహిస్తున్నందుకు గురువారం సికింద్రాబాద్ స్టేషన్ సమీపంలోని మెట్రో పొలిస్ లాడ్జ్‌ను సికింద్రాబాద్ తహశీల్దార్ పాండు నాయక్, డిప్యూటీ తహశీల్ధార్ రంజనీ, గోపాలపురం ఇన్‌స్పెక్టర్ నరేశ్‌ల సమక్షంలో సీజ్ చేశారు. గోపాలపురం పోలీసస్ స్టేషషన్ పరిధిలోని మె ట్రోపొలిస్ లాడ్జ్‌లో గత కొన్ని రోజుల నుంచి 50 గదులను అద్దెకు తీసుకొని మున్వర్ జామ అనే వ్యక్తి వివిధ రాష్ట్రాలకు చెందిన 151 మందికి ఇంగ్లీషు వ్యక్తిత్వ వికాస శిక్షణ, మతపరమైన సమావేశాలను నిబంధనలకు విరుద్ధంగా, అనుమతులు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న గోపాలపురం పోలీస్‌లు రెవెన్యూ అధికారులు హోటల్ ట్రేడ్ లైసెన్‌లను రద్దు చేసి లాడ్జ్‌ని ఎసీజ్ చేశారు.

## చెట్టు మీద పడి తండ్రి మృతి.. స్వల్ప గాయాలతో పడిన కుమారుడు

**సైదాబాద్, అక్టోబరు 17 ప్రభాతవార్త:** మరణం ఏ రూపంలో ఎప్పుడు వస్తుందో ఎవరు చెప్పలేరు. తండ్రి కొడుకులు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా చెట్టు మీద పడడంతో తండ్రి మృతి చెందగా కుమారుడు స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. ఐఎస్ సదన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు పోలీసుల కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. జియాగూడకు చెందిన బాల ప్రకాష్(57) తన కుమారుడు నవనీత్(27) తో కలిసి సాగర్ రింగు రోడ్డు వద్ద ఒక ఫంక్షన్‌కు బుధవారం రాత్రి బయలుదేరాడు. నవనీత్ ద్విచక్ర వాహనంనడుపుతుండగా బాల ప్రకాష్ వెనుక కూర్చున్నాడు. రాత్రి సుమారు 10 గంటల సమయంలో ఐఎస్ సదన్ చౌరస్తా సమీపంలో ఉన్న నైటింగేల్ ఆసుపత్రి దాటి దాటి కొద్దిగా ముందుకు రాగానే ఒక్కసారిగా రోడ్డు పక్కన ఉన్న భారీ చెట్టు ఒరిగి వీరిపై పడింది. ఈ సంఘటనలో బాలప్రకాష్‌కు తీవ్ర గాయాలు కాగా ననవీత్ స్వల్ప గాయాలతో ప్రమాదం నుంచి తప్పించుకున్నాడు. తీవ్ర గాయాలపాలైన బాలప్రకాష్‌ను ఆసుపత్రికి తరలించినప్పటికీ అతను అప్పటికే మృతి చెందాడు. సంఘటన గురించి సమాచారం అందుకున్న ఐఎస్ సదన్ పోలీసులు వివరాలు నమోదు చేసుకుని కేసు దర్యాప్తు జరుపుతున్నారు. రోడ్డుపై పడిన చెట్టును డిఆర్ఎఫ్ సిబ్బంది, పోలీసులు కలసి తొలగించారు. కాగా చెట్టును తొలగించడానికి దుకాణదారుడు చెట్టు మొదట్లో యాసిడ్ పోస్తున్న కారణంగానే చెట్టు ఒక్కసారిగా కూలిపోయి బాలప్రకాష్ మృతి చెందాడన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

## బైక్ నెమ్మదిగా నడపమన్నందుకు వృద్ధుడిపై యువకుడి దాడి -చికిత్స పొందుతూ మృతి

**అల్వాల్, అక్టోబరు 17 ప్రభాతవార్త:** వేగంగా బైక్ ఎందుకు నడుపుతున్నావంటూ వృద్ధుడు ప్రశ్నించినందుకు యువకుడు అతనిపై దాడి చేశాడు. తీవ్రంగా గాయపడిన బాధితుడు చికిత్స పొందుతూ మరణించిన సంఘటన అల్వాల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగి ఆంజనేయులు(64) దేవుని అల్వాల్ ప్రాంతంలో నివాసం ఉంటున్నాడు. పది రోజులు క్రితం శ్రీ బేకరి సమీపంలో రోడ్డుపై నడుస్తుండగా దీపక్ అనే యువకుడు వేగంగా బైక్ నడుపుతూ దగ్గరకి వచ్చాడు. బైక్‌పై అంత వేగం ఎందుకని యువుకుడిని మందలించాడు. కోపానికి గురైన యువకుడు ఆంజనేయులుపై దాడి చేయగా తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. బుధవారం రాత్రి ఆసుపత్రిలో బాధితుడు మరణించాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## గంజాయి విక్రయిస్తున్న నిందితుల అరెస్టు

**కెపిహెచ్‌బి కాలనీ, అక్టోబర్ 17, ప్రభాతవార్త :** గుట్టుగా గంజాయిని విక్రయిస్తున్న నలుగురు నిందితులను గురువారం బాలానగర్ ఎస్‌ఓటి పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తూర్పు గోదావరి జిల్లాకు చెందిన తోరాటి రాజేష్ (24) తంగేళ్ల రమేష్ (27) నక్కా నాగవంశీ (26) పల్నాడు జిల్లాకు చెందిన జంపని సాయిగోపి విహారి (26)లు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లుగా పని చేస్తూ కెపిహెచ్‌బిలోని ఓ హాస్టల్‌లో ఉంటున్నారు. నలుగురు ఒక ముఠాగా ఏర్పడి ప్రతిరోజు మధ్యాహ్నం సమయంలో కెపిహెచ్‌బి కాలనీ 5వ ఫేజ్‌లోని పార్క్ వద్ద గంజాయి విక్రయిస్తున్నారు. విశ్వసనీయ సమాచారంతో బాలానగర్ ఎస్‌ఓటి పోలీసులు పార్క్‌వద్ద వారిని పట్టుకుని, వారి వద్ద నుండి ఎండు గంజాయి చిన్న చిన్న ప్యాకెట్లు 1300 గ్రాములు, 4 సెల్‌ఫోన్లను పోలీసుల స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## ఆటోడ్రైవర్లకు బిఆర్ఎస్ ఎల్లవేళలా అండ : కెటిఆర్



ఆటోడ్రైవర్ల మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కెటిఆర్, మారయ్య, రాంబాబుయాదవ్, సత్తిరెడ్డి, రామకృష్ణ తదితర నాయకులు

**నాంపల్లి, అక్టోబరు 17 ప్రభాతవార్త :** ఆటోడ్రైవర్లకు బిఆర్‌సెస్ పార్టీ ఎల్లవేళలా అండదండా ఉంటుందని, ఏ సమస్య వచ్చినా నా దృష్టికి తీసుకొస్తే సమస్యా పరిష్కారానికి తనవంతు సంపూర్ణకృషి చేస్తానని బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు భరోసానిచ్చారు. ఈమేరకు ఆటో సంఘాల జెఎసీ ఆధ్వర్యంలో నవంబరు 5న ఇందిరాపార్కు వద్ద జరగబోయే ఆటోడ్రైవర్ల మహాధర్నా పోస్టరును గురువారం కెటిఆర్ ఆవిష్కరించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలు అయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌టియు ఆటో యూనియన్ రాష్ట్రాధ్యక్షుడు వేముల మారయ్య, జి.రాంబాబు యాదవ్, టిఎడి ఎస్ ప్రధాన కార్యదర్శి ఎ.సత్తిరెడ్డి, ఉపాధ్యక్షుడు రమేష్, హైమద్ బాయ్, రామకృష్ణ, పరశురాములు, ప్రదీప్, శ్రీనివాసు, బషీర్, ప్రశాంత్‌బాబు, శ్రీరామ్ కిషన్ తదితర యూనియన్ ముఖ్యనాయకులు పాల్గొన్నారు.

## వాల్మీకి రచనలు మానవాళికి స్ఫూర్తిదాయకం

**తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి సభ్య కార్యదర్శి రవి**



టీజీపీసీబీలో వాల్మీకి మహర్షి జయంతి వేడుకలు

**హైదరాబాద్, అక్టోబర్ 17, ప్రభాతవార్త:** మహర్షి వాల్మీకి రచనలు సమస్త మానవాళికి స్ఫూర్తిదాయకమని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీసీపీసీబీ) సభ్య కార్యదర్శి జి.రవి కొనియాడారు. గురువారం వాల్మీకి జయంతి వేడుకలు టీజీపీసీబీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వాల్మీకి రచనలు ధర్మం, కర్మ, భక్తి, అహింస, ఆధ్యాత్మిక వృద్ధికి ప్రాధాన్యతను ఇస్తాయని తెలిపారు. ఆయన రచనలు మనిషిలో నైతిక విలువలు పెంచుతాయని, ఆయన రచనలను ప్రచారం చేయటం ద్వారా సాంస్కృతిక వారసత్వం పెంపొందించవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సామాజిక శాస్త్రవేత్త డబ్ల్యూ జి ప్రసన్నకుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## చిక్కడపల్లి శ్రీవారి ఆలయం హుండి ఆదాయం రూ.24,80,245



లెక్కింపు నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, అక్టోబరు 17 ప్రభాతవార్త:** చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వర స్వామి హుండి లెక్కింపు గురువారం జరిగింది. మొత్తం 108 రోజులకుగాను ఆలయానికి రూ.24లక్షల 80వేల 245 ఆదాయం లభించింది. ఆలయం వ్యవస్థాయ వంశీయుడు జి.శ్రీనాథ్‌గౌడ్, ఈవో కె.రామాంజనేయులు, ఇన్‌స్పెక్టర్ బి.సురేఖ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది. దేవాలయం అభివృద్ధి ప్రతి ఒక్కరు సహకరించాలని ఆలయం నిర్వాహకులు కోరారు.

## చార్మినార్ డివిజనల్ ఇంజనీరుగా శ్రీధర్

**చార్మినార్,అక్టోబరు 17 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతనగరంలో అత్యంత కీలకమైన టిజిఎస్‌పిడిసిఎల్ చార్మినార్ డివిజనల్ ఇంజనీరుగా ఎం.శ్రీధర్ పదవి బాధ్యతలు స్వీకరించారు.ఇక్కడ డిఇగా పని చేసిన టి.లింగయ్య గౌడ్ కీసర డిఇగా బదిలీ అయ్యారు.ఆయన స్థానంలో ప్యారడైజ్ డిఇగా పని చేసిన ఎం.శ్రీధర్ చార్మినార్ విద్యుత్ డిఇగా నియమితులయ్యారు.చార్మినార్ డిఇగా బాధ్యతలు స్వీకరించిన ఎం.శ్రీధర్‌ను డివిజన్ పరిధిలోని ఏడిఈలు,ఏఈలు,అసిస్టెంట్ ఇంజనీర్లు కలిసి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా చార్మినార్ డిఇ ఎం.శ్రీధర్ మాట్లాడుతూ పాతబస్తీలో ప్రజలకు విద్యుత్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండ అన్ని చర్యలు తీసు కుంటానని తెలియజేశారు.గతంలో ఎం.శ్రీ ధర్ బేగంబజర్ డిఇగా కూడ పని చేశారు.

## చూసేందుకు రెండుకళ్లూ చాలని శిల్పకళా సౌందర్యం రామప్ప : స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

**రవీంద్రభారతి, అక్టోబరు 16 ప్రభాతవార్త :** ప్రాచీన చరిత్ర ఆనవాళ్లు, పురావస్తు ప్రాధాన్యతకు మకుటాయమానంగా భారతదేశానికే గర్వకారణంగా యునెస్కోచే ప్రపంచ వారసత్వ కట్టడంగా గుర్తింపు పొందిన తెలంగాణ రాష్ట్రంలోని రామప్ప దేవాలయ శిల్పకళా సౌందర్యాన్ని చూడడానికి రెండుకళ్లూచాలవన్న తెలంగాణ శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ అలాంటి రామప్ప చరిత్ర, చిత్రకళను కళ్లకు కట్టినట్లు రామప్ప నృత్య రూపకాన్ని అత్యంత అద్భుతంగా రవీంద్రభారతిలో ప్రదర్శించడం అభినందనీయమన్నారు. 800 సంవత్సరాలక్రితం కాకతీయ రాజుల పరిపాలనలో ఏ సాంకేతిక పరిజ్ఞానంలేని రోజుల్లో శిల్పకళా సంపద ఉట్టిపడేలా అద్భుతమైన శిల్పాలను తీర్చిదిద్దారన్నారు. దీనిని నృత్యరూపకంగామల్చి సులువుగా అర్థమయ్యేరీతిలో ప్రదర్శించిన నృత్య కళాకారిణి, నాట్యగురు డా. కోకా విజయలక్ష్మిని ఎంతగానో ప్రశంసించారు. రామప్ప దేవాలయ చరిత్ర, చిత్రకళలను విశ్వవ్యాప్తం చేస్తున్న భారత రంగస్థలి అకాడమీకి ప్రభుత్వం తరఫున సహాయ సహకారాలు అందించడానికి తనవంతు కృషిచేస్తానని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన స్పీకర్ ప్రసాద్‌కుమార్ భరోసానిచ్చారు. భారత రంగస్థలి అకాడమీ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ రామప్ప నృత్య గీతాన్ని ప్రైడ్ ఆఫ్ రామప్ప పేరుతో రూపొందించింది. రామప్ప శిల్పాల ప్రేరణగా శివతాండవం, కృష్ణుని రాసలీల, కోలాట నృత్యాలు కూచిపూడి శైలిలో ప్రదర్శింపబడ్డాయి. నేటి ప్రదర్శనల్లో కూచిపూడి నృత్యాన్ని ప్రముఖ నృత్యకారిని, నాట్యగురువు కోకా విజయలక్ష్మి, ఆమె శిష్యబృందం ప్రదర్శించారు. గంటసేపు నిర్విరామంగా ప్రదర్శింపబడిన ప్రైడ్ ఆఫ్ రామప్ప రామప్ప ప్రత్యేక గీతంతో ముగిసింది.

ఈ గీతం రచన దండిభోట్ల వైకుంఠ నారాయణమూర్తి, సంగీతం ఫణి నారాయణ, గాత్రం నిహాల్, నృత్యదర్శకత్వం కోకా విజయలక్ష్మి, డా. ఆర్.శ్రీకాంత్ రూపకల్పన చేశారు.



రామప్ప నృత్యరూపకంలో దృశ్యాలు

## నాడు అక్రమం..నేడు సక్రమం

- -కూల్చివేతలు చేపట్టిన భవనంలో కొనసాగుతున్న నిర్మాణ పనులు..
- -అధికారుల లీలలు అంతఇంత కాదయో...?

**దుండిగల్, అక్టోబర్ 17 ప్రభాతవార్త:** నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగించే రహదారి పక్కన ప్రభుత్వ అనుమతులు లేకుండా ఓ భారీ బహుళ అంతస్థుల నిర్మాణం కొనసాగుతుంది. నిబంధనలు ఉల్లంఘించి శరవేగంగా నిర్మాణ పనులు జరుగుతూ ఐదవ అంతస్థుకు చేరువలో ఉంది. అప్పుడు అధికారులు వర్గాలు అక్కడి చేరుకున్నాయి. అనుమతుల్లేకుండా నిర్మాణం ఏలా చేపడుతారంటూ టిపివో అగ్గిమీద గుగ్గిలంలా మండిపడ్డారు. వెంటనే బ్రేకర్లు తెప్పించండి అంటూ సిబ్బందికి ఆదేశించారు. గజగజ వణికిన సిబ్బంది వెంటనే బ్రేకర్లు రప్పించి మూడు స్లాబులను చాప వెడల్పుతో పగులగొట్టారు. ఇకపై నిర్మాణం జరగవద్దంటూ హెచ్చరికలు జారీ చేశారు. అయితే అధికార పార్టీ వర్గాలు జోక్యం చేసుకున్నాయి. మండిపడిన అధికారులు మద్దతుగా నిలబడడంతో వణికిన సిబ్బంది వస్తాదులు అయ్యారు. అక్రమ నిర్మాణం సక్రమమై జోరుగా సాగుతుంది. దుండిగల్ పురపాలిక సంఘం పరిధి మల్లంపేట ఖాజిపల్లి రహదారి పక్కన (హెచ్ఎండిఏ మాస్టర్ ప్లాన్‌లో 100ఫీట్ల రహదారి) సుమారు 500గజాల స్థలంలో కొంతకాలంగా అనుమతుల్లేకుండా బహుళ అంతస్థుల నిర్మాణం జరుగుతుంది. నిరాటకంగా పనులు జరుగుతున్నాయి. ఆయా ప్రాంతాల సిబ్బంది నిత్యం పర్యవేక్షిస్తూ అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాల్సి ఉండగా గోప్యంగా ఉంచారు. అక్రమంగా నిర్మాణం జరుగుతుందంటూ అధికారులకు ఫిర్యాదులు వెల్లువెత్తిన స్పందించలేదు. దీంతో పలువురు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో అప్పుడు అధికారులు కదిలారు. నిర్మాణం వద్దకు చేరుకొని అనుమతుల్లేకుండా జరుగుతుంటే ఏం చేస్తున్నావంటూ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేసి(అధికారులకు తెలియకుండా జరగడం కష్టమే) కూల్చివేతలు చేపట్టారు. కాగా ఈవిషయంలో అధికార పార్టీ నాయకుడు కలుగజేసుకోవడంతో నిర్మాణం మళ్ళీ మొదలైంది. అప్పుడు అక్రమం అన్న అధికారులు ఇప్పుడు మౌనం వహిస్తూ పరోక్షంగా సహకరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఏ ఎండకు ఆగొడుగు అన్నట్లు మొన్నటి వరకు కారులో చెక్కర్లు కొట్టిన అధికారగణం ఇప్పుడు చేతిలో చెయ్యి వేసి నడుస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. దీంతో అధికారుల లీలలు అంత ఇంత కాదయో అంటూ పలువురు ముక్కున వేలేసుకుంటున్నారు.



అదే నిర్మాణంలో కొనసాగుతున్న పనులు (వృత్తంలో)



అక్రమ నిర్మాణం అంటూ కూల్చివేస్తున్న మున్సిపల్ సిబ్బంది

## గాయత్రినగర్‌లో మహిళలకు ప్రత్యేక జాబ్ మేళా

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 17, ప్రభాతవార్త**

అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌లో మహిళలకై ప్రత్యేక జాబ్ మేళా నిర్వస్తున్నామని నిర్మాణ్ ఎన్జీఓ సంస్థ ప్రతినిధి ప్రకాష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆధ్యాత్మిక సంస్థ బ్రహ్మకుమారీస్‌తో సంయుక్తంగా తాము ఈ జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. డిగ్రీ అర్హత కల్గిన మహిళలకు ప్రత్యేకించి ఈ జాబ్ మేళా ఏర్పాటు చేశామని, ప్రముఖ ఐటీ కంపెనీలతో పాటు ఉత్పాదక రంగం, ఐటీస్, రిటైల్, ఫార్మా, బ్యాంకింగ్, హెల్త్‌కేర్, బీపీఓ రంగాల నుంచి అనేక కంపెనీలు రిక్రూట్‌మెంట్ చేయనున్నామని తెలిపారు. ఉత్తీర్ణతలు కల్గిన అభ్యర్థులకు స్పాట్ ఆఫర్లు అందజేస్తారని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు. ఆసక్తిగల వారు శుక్రవారం ఉదయం గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలలోపు గాయత్రినగర్ హరిహర క్షేత్రం దేవస్థానం సమీపంలోని ప్లాట్ నెం.42కు రావాల్సిందిగా కోరారు. ఆసక్తిగల అభ్యర్థులు ఫోన్ నెం.91541 45734కు కాల్ చేయాలని సూచించారు. అభ్యర్థుల వయసు 18 నుంచి 28లోపు ఉండాలని, విద్యార్హతలు తెలిపే విధంగా రెజ్యుమెతో పాటు టెన్త్, ఇంటర్, డిగ్రీ సర్టిఫికేట్లు, ఆధార్, 2 పాస్‌పోర్టుసైజు ఫోటోలు వెంట తెచ్చుకోవాలని నిర్మాణ్ ఎన్జీఓ ప్రతినిధులు సంపత్, ప్రకాష్ తెలిపారు.

## బస్తీల అభివృద్ధి కోసమే సొసైటీ ఏర్పాటు

**యూసుఫ్‌గూడ, అక్టోబర్ 17, ప్రభాతవార్త**

ఎస్పీఆర్ హిల్స్‌లోని ఉమ్మడి బస్తీలను అభివృద్ధి పర్చుకునేందుకు ఉమ్మడి బస్తీల డెవలప్‌మెంట్ ఫెడరేషన్ సొసైటీని ఏర్పాటు చేసుకోవటం జరిగిందని నూతన అధ్యక్షునిగా ఏకగ్రీవంగా ఎన్నికైన జంగిటి పుల్లని జ్ఞానేశ్వర్ అన్నారు. ఇందుకు గాను రహమత్‌నగర్ డివిజన్ పరిధిలోని శివమ్మ పాపిరెడ్డి హిల్స్‌లో సమావేశం నిర్వహించారు. శివమ్మపాపిరెడ్డి హిల్స్ (ఎస్పీఆర్ హిల్స్) ఉమ్మడి బస్తీల డెవలప్‌మెంట్ ఫెడరేషన్ సొసైటీని పేదలపాలిటి ఆత్మబంధువైన మాజీ మంత్రి సీఎల్పీ నాయకుడు పీ జనార్ధన్‌రెడ్డి ప్రోత్సాహంతో 1994 సంవత్సరంలో 448 నెంబర్‌లో రిజిస్ట్రర్ నమోదైన ఈ సంఘంను తిరిగి ముక్తకంఠంతో అన్ని బస్తీల సహకారంతో అభివృద్ధిపర్చుకునేందుకు సెంట్రల్ కమిటీ అనబడే ఉమ్మడి బస్తీల కమిటీని పునరుద్దరించడం జరిగిందని తెలిపారు. ఈ ఫెడరేష్ సొసైటీకి అధ్యక్షునిగి మహాత్మానగర్ వ్యవస్థాపన అధ్యక్షులు జంగిటి పుల్లని జ్ఞానేశ్వర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకోవడమైంది. జ్ఞానేశ్వర్ తన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలో సలహాదారులను, వర్కింగ్‌ప్రెసిడెంట్లను, అడిషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్‌ను, ఉపకార్యదర్శులను, ఆర్గనైజింగ్ సెక్రటరీలను, కోశాధికారిని నియమించారు. ఎస్పీఆర్ హిల్స్‌లోని 25 బస్తీలలో ఈ ఫెడరేషన్ సొసైటీ ప్రజలు సూచించే కార్యక్రమాలతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాలు స్థానిక కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి అండదండలతో, సహకారంతో ముందుకు వెళ్లడం జరుగుతుందని పేర్కొన్నారు.

## వ్యాపారులతో జూబ్లీహిల్స్ పోలీసుల సమావేశం..

**పంజగుట్ట, అక్టోబర్ 17 ప్రభాతవార్త:**

ఎలాంటి ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడకుండా జూబ్లీహిల్స్ పోలీసులు వ్యాపారులతో ముందస్తుగా సమావేశమయ్యారు. చికెన్, మటన్, బీఫ్ వ్యాపారులతో గురువారం జూబ్లీహిల్స్ పోలీసులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ ప్రతి షాపులోనూ లోపల బయట రెండు సీసీ కెమరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. మాంసం వ్యర్థాలను రోడ్లపై చెత్తకుప్పల్లో వేయకుండా కవర్లలో ప్యాక్ చేసి డంపింగ్ యార్డుకు పంపే విధంగా చూడాలన్నారు. వ్యర్థాలను నిరక్ష్యంగా పడవేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. సమావేశంలో డీఐ మధుసూధన్, ఎస్ఐలు జానయ్య, హరీశ్వరరెడ్డి, స్థానిక వ్యాపారులు పాల్గొన్నారు.

## క్యాథలిక్ గ్రేవ్ యార్డులో వసతులు కల్పిస్తాం

**-ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**



ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసిన క్యాథలిక్ గ్రేవ్ యార్డు నిర్వాహకులు

**సికింద్రాబాద్, అక్టోబర్ 17 ప్రభాతవార్త:** నవంబర్ 2న నిర్వహించే హోల్ సోల్స్ డే పవిత్ర ఆత్మల దినోత్సవం సందర్భంగా అన్ని ఏర్పాట్లు జరిగేలా చర్యలు తీసుకుంటామని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం బన్సీలాల్‌పేట్‌లోని బోయిగూడ క్యాథలిక్ గ్రేవ్ యార్డ్ నిర్వాహకులు తలసాని శ్రీనివాస్ యాదవ్ కార్యాలయంలో కలిసి హోల్ సోల్స్ డే పవిత్ర ఆత్మల దినోత్సవం సందర్భంగా గ్రేవ్ యార్డుకు వేలాదిమంది వస్తారని, వారు ఎలాంటి అసౌర్యానికి గురికాకుండా ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం కూడా వసతులు, సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ గ్రేవ్ యార్డును శుభ్రపర్చడం, లైటింగ్, చెత్త, వ్యర్థాలను తొలగించి పరిశుభ్రమైన వాతావరణం కల్పించేలా అధికారులను ఆదేశిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలత, ఫాదర్ ఆరోగ్యం హుజీ టార్చర్ జయరాజ్, పియర్ డిసిల్వా, సదాయ్‌రాజ్, నేతలు వెంకటేషన్ రాజు పాల్గొన్నారు.

## బాలికలు పట్టుదలతో చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారు

**-డిఎల్ఎస్ఎ కార్యదర్శి,సెషన్ జడ్జి అరుణ కుమారి**



కార్యక్రమంలో పాల్గొన్న డిఎల్ఎస్ఎ కార్యదర్శి, సెషన్ జడ్జి అరుణ కుమారి,

**చార్మినార్,అక్టోబరు 17 ప్రభాతవార్త :**

బాలికలు అన్ని రంగాలలోను రాణించ వలసిన అవసరం ఎంతైనా ఉందని హైదరాబాద్ డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ ఆథారిటీ కార్యదర్శి,సెషన్ జడ్జి అరుణ కుమారి అన్నారు.పాతబస్తీ దూద్‌బౌలిలోని ఆశ్రిత హోమ్‌ను గురువారం ఆమె సందర్శించారు.బాలికలకు పలు అంశాలపై జడ్జి అరుణ కుమారి అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా జడ్జి అరుణ కుమారి మాట్లాడుతూ బాలికలు మంచి క్రమ శిక్షణ,పట్టుదలతో చదువుకుంటే తప్పకుండ ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలిపారు.బాలికలు తమ ఆరోగ్యం విషయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆమె తెలియజేశారు.ఈ కార్యక్రమంలోపిఐపిసి విజయ్ భాస్కర్,ఎస్ఐ భాస్కర్,సత్యనారాణ,ఆశ్రిత హోం ప్రోగ్రామ్ కన్వీనర్ వి.పర్వతాలు,టీమ్ సభ్యులు రాజేష్,స్వప్న,శిరీష, హెలెన్,శివమ్మ, నాగమణితో పాటు పలువురు పాల్గొన్నారు.

## మనుషుల అక్రమ రవాణ నిర్మూలనలో అందరం భాగస్వాములవుదాం

**- నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్**



నార్సింగిలో ఏర్పాటు చేసిన రెండు రోజుల శిక్షణా తరగతుల ముగింపు సమావేశంలో పాల్గొన్న చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్.

**నార్సింగి, అక్టోబర్ 17 ప్రభాతవార్త :** మనుషుల అక్రమ రవాణా నిర్మూలనలో అందరం భాగస్వాములం అవుదామని నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ శేరిలింగంపల్లి ప్రాజెక్టు ఆధ్వర్యంలో నార్సింగిలో రెండు రోజుల శిక్షణా తరగతుల ముగింపు సమావేశం జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన నాగపూర్ణ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణ ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తుందని, వేలాది మంది యువతల జీవితాలను చిదిమేస్తుందన్నారు. ఈ అక్రమ రవాణాకు పేద, మధ్య తరగతికి చెందిన యువతులే సమిధలవుతున్నారని పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్లు పేద యువతులకు మానవ అక్రమ రవాణా అంశంపై అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ ట్రాకింగ్ చాలా వేగంగా విస్తరిస్తుందని, యుక్త వయసులో ఉన్న బాలికలు, యువతులకు ఫోన్‌లు దూరంగా ఉంచాలని, ఫోన్ ద్వారా జరిగే నష్టంను వివరించాలన్నారు. సిడిపిఓ కవిత మాట్లాడుతూ ఈ మానవ అక్రమ రవాణాను ఆదిలోనే అడ్డుకుంటే ఆడ పిల్లలను రక్షించుకోవచ్చని తెలిపారు. ఉద్యోగం, ప్రేమ, పెళ్లి,సినిమా అవకాశాల పేరుతో పేద, మధ్య తరగతికి చెందిన యువతలను ఉచ్చులోకి లాగి మోసం చేస్తున్నారన్నారు. అనంతరం ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామకృష్ణ మాట్లాడుతూ ప్రజ్వల సంస్థ గత 28.ఏళ్లుగా లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా పని చేస్తుందని, ఇప్పటి వరకు 28,600 మంది యువతులను కాపాడి పునరావాసం కల్పించామని వివరించారు. యువతులను జాగృత పరిచి, మోసపోకుండా కాపాడుకునేందుకు ప్రజ్వల సంస్థ నిరంతరం పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్‌లు నీలవేణి, ఇందిరా రాణి, ఉమారాణి, పద్మ, పద్మజ ప్రజ్వల ప్రతినిధులు సురేష్, ఒబర్‌సింగ్, చెన్న కేశవ్, ఆశ్రిత, దశరత్, ఉమా మహేశ్వరి, రజిత తదితరులు పాల్గొన్నారు.

## మంచిమనస్సున్న మహరాజు దుగ్గిరాల సోమేశ్వరరావు

**-తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు డా. కె.వి.రమణాచారి**



దుగ్గిరాల సోమేశ్వరరావు ఆత్మీయ పురస్కారగ్రహీతలతో హెచ్.జె.దొర, కె.వి.రమణాచారి, సారిపల్లి, శాస్త్రి, మోహనసేనాపతి తదితర అతిథులు

**నాంపల్లి, అక్టోబరు 17 ప్రభాతవార్త :** దుగ్గిరాల సోమేశ్వరరావు గొప్పనటుడు, దర్శకుడు, కవి, రచయిత, వ్యాసకర్తగా బహుముఖీన ప్రతిభావంతుడు అన్నింటికీ మించి మంచిమనస్సున్న మహరాజు అని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి అన్నారు. కళ భగవత్‌దత్తమని, అందరికీరాదని, భగవంతుడి ఆశీస్సులుంటే అది సాధ్యమని అన్నారు. ఏమాత్రం అహంకారం లేకుండా ఒదిగివుంటూ ఎదుటివాడు ఎదుగుతూ ఉంటే ఆనందించే మనస్తత్వమున్న మహానుభావుడని, ఎంతోమంది నటీనటులుగా తీర్చిదిద్దారని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వ టెలిఫోన్ సంస్థ ఉద్యోగిగా ఇంజనీర్‌గా పనిచేస్తూ ఎన్నో భవనాలు కట్టించినా పేర్గాంచిన సైఫాబాద్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ భవన నిర్మాణం ఆయన్ను కలకాలం గుర్తుచేస్తుందంటూ ప్రభుత్వంలో ఉండి ఏంచేసామని కాదు, చేసినపని ఎంతవరకు నిలిచి ఆదరణ పొంది మేలుజరిగిందనేది ముఖ్యమన్నారు. దుగ్గిరాల సోమేశ్వరరావు ఏపనైనా అంకితభావం, దీక్ష, సమయ పాలనతో చేసే మహోన్నత రంగస్థల నటుడు, దర్శకుడని విశ్రాంత డిజిపి హెచ్.జె.దొర ఘననివాళులర్పిస్తూ ఆయన పేరున రంగస్థల ప్రముఖులకు పురస్కారాలివ్వడం ఆనందంగా, ఆయన్ను స్ఫూర్తిగా ఉందని కొనియాడారు. రసరంజని, హైదరాబాద్, దుగ్గిరాల కుటుంబం సంయుక్త ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో ప్రఖ్యాత నటుడు, దర్శకుడు, ఎన్‌టిఆర్ అవార్డు గ్రహీత దుగ్గిరాల సోమేశ్వరరావు 92వ జయంతి వేడుకలను పురస్కరించుకొని పలువురు రంగస్థల ప్రముఖులకు దుగ్గిరాల ఆత్మీయ పురస్కారాలను ప్రదానోత్సవం ఘనంగా జరిగింది. గురువారం రాత్రి సారిపల్లి కొండలరావు సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ డిజిపి హెచ్.జె.దొర విచ్చేసి సభాప్రారంభకుడు డా. కె.వి. రమణాచారి, ఆత్మీయ అతిథులు బి.ఎం.రెడ్డి, ఎం. కామేశ్వరరావు, సోమేశ్వరరావు కుమారుడు డా. డిజిపి.శాస్త్రి, మోహన సేనాపతి తదితరులతో కలిసి సీనియర్ రంగస్థల నటులు సిహెచ్.నారాయణస్వామి, సుసర్ల కామేశ్వరశర్మ, కేతినీడి నటరాజ్, సత్కళాభారతి జి.సత్యనారాయణ, డా. బిహెచ్.పద్మప్రియలను ఘనంగా సత్కరించి రసరంజని దుగ్గిరాల సోమేశ్వరరావు ఆత్మీయ పురస్కారం ప్రదానంచేసి అభినందనలు తెలిపారు.


## 19న చార్మినార్ వద్ద సద్భావనా యాత్ర స్మారక దినోత్సం

**-మాజీ మంత్రి గీతారెడ్డికి సద్భావనా అవార్డు ప్రధానం**

**చార్మినార్,అక్టోబరు 17 ప్రభాతవార్త :** రాజీవ్‌గాంధీ సద్భావనా యాత్ర స్మారక సమితి ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన చార్మినార్ వద్ద జరగనున్న సద్భావనా యాత్ర స్మారక దినోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రి,టిపిసిసి వర్కింగ్ ప్రెశిడెంట్ డాక్టర్ జె.గీతారెడ్డికి సద్భావనా అవార్డును ప్రధానం చేయనున్నామని రాజీవ్‌గాంధీ సద్భావనా యాత్ర స్మారక సమితి ప్రధాన కార్యదర్శులు జి.ఆనంద్,సయ్యద్ ముజాహిద్ హుస్సేని,సీనియర్ కాంగ్రెస్ నాయకులు జి.కన్నయ్యలాల్ తెలిపారు.శనివారం ఉదయం 10.30 గంటలకు చార్మినార్ వద్ద రాజీవ్‌గాంధీ సద్భావనా యాత్ర స్మారక దినోత్సం ఉత్సవాలకు జరుగుతాయని వారు తెలియజేశారు.టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ గౌడ్ పార్టీ పతాకాన్ని ఎగురు వేయనున్నారని,రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,రాష్ట్ర కాంగ్రెస్ ఇంఛార్జి దీపాదాస్ మున్షీ,రాష్ట్ర మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి,పొన్నం ప్రభాకర్, దామోధర్ రాజా నర్సింహ్మా,డి.శ్రీధర్ బాబు, డి.శీతక్క, మాజీ ఎంపి వి.హనుమంతరావుతో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటున్నారని వారు తెలిపారు .కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన వారు విజ్ఞప్తి చేశారు.మాజీ ప్రధాన మంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ 1990 అక్టోబరు నెల 19వ తేదీనచార్మినార్ నుంచి సద్భావనా యాత్ర ప్రారంభించారని,అప్పటి నుంచి ప్రతీ సంవత్సరం చార్మినార్ వద్ద సద్భావనా యాత్ర స్మారక దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని, వారు తెలిపారు.ప్రతీ సంవత్సరం చార్మినార్ వద్ద జరిగే కార్యక్రమంలో సద్భావనా అవార్డును సమితి తరుపున ప్రధానం చేస్తున్నామని, ఈ ఏడాది మాజీ మంత్రి టిపిసిసి వర్కింగ్ ప్రెశిడెంట్ డాక్టర్ జె.గీతారెడ్డికి సద్భావనా అవార్డును ప్రధానం చేయనున్నామని వారు వెల్లడించారు.

## ఎవ్వరూ అధైర్య పడొద్దు అండగా ఉంటా : ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి

**-మూసి పరీవాహక ప్రాంతాల్లో ఎంపి, బిజెపి నేతల పర్యటన**



**అత్తాపూర్ అక్టోబరు17,ప్రభాతవార్త :**

ముసి పరివాహక ప్రాంతాల ప్రజలు ఎవ్వరూ కూడా అధైర్య పడొద్దని అన్ని విధాలుగా అండగా ఉంటామని చేవెళ్ల ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం రాజేంద్రనగర్ సర్కిల్‌లోని అత్తాపూర్ డివిజన్ ముసి పరివాహక భరత్ ,టికెఆర్ కాలనీలలో కంటెస్టెడ్ ఎమ్మెల్యే తొకల శ్రీనివాస్ రెడ్డి ,చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ మల్లారెడ్డి,బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్,రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్‌లతో కలిసి ఎంపి కొండా విశ్వేశ్వర్ రెడ్డి పర్యటించారు.ఈ మేరకు అధికారులు ఇండ్లకు మార్కింగ్ వేయడంతో ఆ బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు.ఈ సందర్బంగా ఎంపి కొండా మాట్లాడుతూ....అధికారులు 5 ఏళ్ల క్రితం అన్ని విధాలుగా హద్దులు సర్వే నిర్ణయించారని ఇది ఉంది కబట్టే పేద ఇండ్లు నిర్మించుకున్నారని ఇప్పుడు కొత్తగా వచ్చి మార్కింగ్ వేయడం దుర్మార్గపు చర్య అని పేర్కొన్నారు. ముసీ సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ఇండ్ల కూల్చివేతలపై కొండా విశ్వేశ్వర రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.పేదల ప్రజల మీద ప్రభుత్వం పెత్తనం చూపవద్దని కోటీశ్వరులపై చూపాలని సూచించారు. ఎంతో కష్టపడి రూపాయి రూపాయి కూడా పెట్టి ఇండ్ల నిర్మించుకున్నారని ఇప్పుడు వారి ఇండ్లను కూల్చి రోడ్ల మీద పడిస్తే వారు ఎక్కడికి వెళ్లాలన్ని పేద ప్రజల జోలికి వస్తే సహించేది లేదని తేల్చిచెప్పారు.పేదల భాదను పట్టించుకోకుండా ప్రభుత్వం బలవంతంగా కూల్చివేతలకు పాల్పడితే లక్ష మందితో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.ఇళ్లు కొల్పోతున్న ప్రతి ఒక్కరికి మూడింతలు పరిహారం చెల్లించాకే ఇళ్లు ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు.పేద ప్రజలు ఎవ్వరూ భయపడోద్దని వారికి అన్ని విధాలు అండగా ఉంటామని భరోసా కల్పించారు.ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి నాయకులు,ముసి బాధితులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వివేకానందను కలిసిన బిఆర్ఎస్ నాయకులు



ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

**పేట్ బషీరాబాద్, అక్టోబర్ 17, ప్రభాతవార్త**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన ఉద్యమకారులు సంపత్ మాధవరెడ్డి, గుమ్మడి మధుసూదనరాజులు గురువారం ఎమ్మెల్యే కెపి వివేకానంద గౌడ్‌ని మర్యాదపూర్వకంగా కలిసి దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో 132 డివిజన్ బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సుధాకర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, సూదల సంపత్ గౌడ్, తోకల నగేష్‌రెడ్డి, ఎల్లయ్యగౌడ్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికను వ్యభిచారం చేయమని కన్న తల్లి ఒత్తిడి

**-ఇంటి నుంచి పరారీ..పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు**

**అల్వాల్,అక్టోబరు 17 ప్రభాతవార్త:**

కన్న తల్లి మైనర్ కూతురిని వ్యభిచారం చేయమని ఒత్తిడి చేయడంతో ఇంటి నుంచి పరారై పోలీసులు శరణు కోరింది. ఇది తెలిసిన బాలిక తల్లి తన అనుచర గణంతో పోలీసు స్టేషన్‌కు వచ్చి సిబ్బందితో వాగ్వివాదానికి దిగడం చర్చాంశనీయంగా మారింది. సంఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. అల్వాల్ వెంకటాపురంలో నివసించే నాగినా(40) మైనర్ కూతురిని వ్యభిచారం కూపంలోకి లాగడానికి ప్రయత్నించింది. భయంతో మైనర్ బాలికి ఇంటి నుంచి తప్పించుకుని అల్వాల్ పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు నాగినాపై ఫోక్సో సెక్షన్‌లు కింద కేసు నమోదు చేసి గురువారం జైలుకు పంపించారు. బాలికను సఖి సెంటర్‌కు తరలించడం జరిగింది.

## వార్ధక్య ఆలోచనే మనసుని ముసలివారిని చేస్తుంది : సినీనటుడు ప్రదీప్



సీనియర్ సిటిజన్స్‌ను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, అక్టోబరు 17 ప్రభాతవార్త:**

వార్ధక్య ఆలోచనే మనసుని ముసలివారిని చేస్తుందని, అందుచే కృష్ణశాస్త్రి కవిలో చెప్పినట్లు పదుచుగుండె ఎప్పటికీ ఉండేలా చూసుకోవాలని ప్రముఖ సినీనటుడు ప్రదీప్ అన్నారు. గురువారం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ వార్షికోత్సవ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా సినీనటుడు ప్రదీప్ హాజరై సీనియర్ సిటిజన్స్ సిక్స్‌ప్యాక్ సూత్రాలను పాటించాలన్నారు. శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం, ఆర్థిక స్వాతంత్ర్యంపైన ఒకరు ఉన్నారన్న నమ్మకంతో ఆధ్యాత్మిక కార్యక్రమాలు, మానవ సంబంధాలు కొనసాగించడం, తనకుతానే ప్రేరణ పొందడం ప్రతి వయోధికుడు పాటిస్తే జీవితం ఆనందమయం అని అన్నారు. ప్రధాన కార్యదర్శి మాచెర్ల రంగయ్య నివేదికలో పద్నాలుడు ఏళ్ళ క్రితం తమ అసోసియేషన్ ఆరంభమైందన్నారు. అధ్యక్షత వహించిన అసోసియేషన్ అధ్యక్షుడు పుల్లయ్య తమ సంస్థ నిర్వహించిన సేవా కార్యక్రమాలను వివరించారు. సంయుక్త కార్యదర్శి నరసింగరావు స్వాగతం పలుకగా మురళీధర్, చంద్రబోస్, అభినందన భవానీ, పూర్వ డిఆర్ఓ మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు. తొలుత జైహింద్ సంస్థ సభ్యులు పలు సినీ గీతాలను ఆలపించారు. వివరించారు.

## మాజీ మంత్రి కెటిఆర్‌ను కలిసిన బిఆర్ఎస్ నేతలు



మాజీ మంత్రి కెటిఆర్‌ను కలిసిన మాజీ కార్పొరేటర్ విఎస్ఆర్ తదితరులు

**చిక్కడపల్లి, అక్టోబరు 17 ప్రభాతవార్త:**

బిఆర్ఎస్ పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న సీనియర్లను విస్మరించే ప్రసక్తేలేదని మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పష్టం చేశారు. గురువారం రామ్‌నగర్ మాజీ కార్పొరేటర్, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వి.శ్రీనివాస్‌రెడ్డి నేతృత్వంలో నాయకులు కల్వగోపి, అజయ్ ముదిరాజ్, జోగిందర్, సిరిగిరి శ్యామ్, ఆటో శ్రీను, రమేశ్, సిరిగిరి కిరణ్, బాలరాజ్ గౌడ్, సదా, సత్యనారాయణ, వెంకటేశ్, శివ, మధు తదితరులతో పాటు పెద్దసంఖ్యలో కెటిఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీకి అంకితభావంతో పనిచేసే వారిని తప్పక గుర్తిస్తుందన్నారు. ప్రభుత్వ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యపరచాలని సూచించారు.


## నాచారంలో ఎమ్మెల్యే బిఎల్ఆర్ పర్యటన



సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బిఎల్ఆర్, కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, అక్టోబర్ 17 ప్రభాతవార్త:**

నాచారం డివిజన్ పరిధిలోని పటేల్ కుంట చెరువును అధికారులతో కలిసి ఎమ్మెల్యే బిఎల్ఆర్ పర్యటించారు. రూ. 80 లక్షల వ్యయంతో పటేల్ కుంట చెరువు వద్ద నిర్మించిన సివరేజ్ డైవర్షన్ పనులు పూర్తి అయినా ఉపయోగంలోకి తీసుకురాకపోవడంతో ఎమ్మెల్యే, కార్పొరేటర్ శాంతి సాయిజన్ శేకర్ సందర్శించి ఇరిగేషన్ అధికారుల పనితీరుపై మండిపడ్డారు. అనంతరం వారు చెరువులో పేరుకుపోయిన గుర్రపు డెక్క తొలగించేందుకు ఎఫ్‌టిఐఎస్ యంత్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇంటర్నేషనల్ కామనె ల్త్ పవర్ లిఫ్టింగ్‌లో గోల్డ్ మెడల్ సాధించిన వైష్ణవిని అభినందిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

## సంస్కృతంలో మహర్షి వాల్మీకి చేసిన రచనలు నేటికీ ప్రామాణికం



బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ఆధ్వర్యంలో మహర్షి వాల్మికి జయంతి నిర్వహించిన దృశ్యం

**చిక్కడపల్లి, అక్టోబరు 17 ప్రభాతవార్త:** సంస్కృతంలో మహర్షి వాల్మీకి చేసిన రచనలు నేటికి చిరస్థాయిగా నిలిచి ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు. గురువారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కళాశాల ఆధ్వర్యంలో మహర్షి వాల్మికి జయంతి వేడుకలు ఘనంగాజరిగాయి. కళాశాల డైరెక్టర్ విష్ణుప్రియ మాట్లాడుతూ అంతరించిపోతున్న సంస్కృతుల్ని వాల్మికి రచనలలో ఇంకా ఉన్నాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ మాట్లాడుతూ భాష అనేది మన సంస్కృతి, సంప్రదాయాలను తెలియజేస్తాయని, ప్రతి ఒక్కరు భాషల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. వాల్మికి మహర్షి పట్టుదలతో అనేకమైన రచనలు చేసి భావితరాలకు అందించారని, వాటిని పరిరక్షించుకోవాలన్నారు. విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరు భాషపై పట్టుసాధించుకోవాలన్నాఉ. సంస్కృతం అధ్యాపకులు ప్రసంగిస్తూ విద్యార్థి దశలో పట్టుదలతో శ్రమించి ముందుకు సాగడం నేర్చుకుంటేనే అనుకున్న లక్ష్యాన్ని చేరుకోగలరన్నారు. అందులో వాల్మికి మహర్షిని ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ప్రాచీనకాలం నుంచి వస్తున్న ఇతిహాసాలు, రామాయణం మొదలుకొని సాహిత్య పుస్తకాలను చదవడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్స్, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## 34 కేసులున్నాయని తప్పుడు ప్రచారం చేయడం తగదు

**-చర్చ్ సొసైటీ అధికారప్రతినిధి రాగి వీరాచారి**

**చిక్కడపల్లి, అక్టోబరు 17 ప్రభాతవార్త:** ప్రసిద్ధ క్రైస్తవులకు ఎంతో గొప్ప ఆధ్యాత్మిక కేంద్రమైన హెబ్రోన్ చర్చ్ ట్రస్ట్ సభ్యులు తనపై 34 కేసులున్నాయని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఇవి సత్యదూరమని చర్చ్ సొసైటీ ప్రతినిధి రాగి వీరాచారి స్పష్టం చేశారు. ఇటీవల హైకోర్టులో కేసులపై న్యాయస్థానం స్టే ఇస్తూ తమకు అనుకూలంగా తీర్పును వెల్లడించడం జరిగిందని గురువారం చిక్కడపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తనపై జరిగిన ఈ తప్పుడుప్రచారం అంశాన్ని హైకోర్టులో న్యాయమూర్తికి దృష్టికితీసుకెళ్లడం జరిగిందని, ట్రస్ట్‌వారు పెట్టినవి నాలుగు కేసులు మాత్రమే ఉన్న పరిశీలించిన కోర్టు కొంత మంది కలిసి హెబ్రోన్ చర్చ్‌పై దాడి చేశారని అన్నారు. ఎలక్ట్రికల్ యంత్రాలతో గేట్లకు తాళాలు కోసి, పగలగొట్టి అక్రమంగా లోనికి ప్రవేశించి దౌర్జన్యం చేశారని ఆరోపించారు. ట్రస్ట్‌కు చెందిన వ్యక్తి ఆ రోజు హెబ్రోన్ చర్చ్ గోడపై నుంచి దూకడంతో చెయి వెలికి గాయం అయిందన్నారు. ఆ గాయాన్ని అదనుగా చూపించి అతనిపై దాడి చేశానని తనపై అక్రమంగా కేసులు పెట్టారని వాపోపాయరు. ప్రభుత్వం, పోలీసులు ఈ విషయాలను గమనించి తమకు తగిన విధంగా న్యాయం చేయాలని కోరారు.

## పౌరాణిక నాటకం లేకుంటే రామాయణ, మహాభారతం కథలు ప్రజలకు అందేవి కావు



రంగస్థల కళాకారులను సత్కరించిన దృశ్యం

**చిక్కడపల్లి, అక్టోబరు 17 ప్రభాతవార్త:** తెలుగు సాహిత్య తొలి సోపానం పద్యం అని ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అన్నారు. ఆరాధన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న పద్యనాటకోత్సవాల్లో భాగంగా చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళావేంకట దీక్షితులు కళావేదికలో 'చింతామణి, భవాని శంకరుల ప్రణయ సన్నివేశం' ప్రదర్శన అద్భుతంగా సాగింది. ఎన్.చంద్రబాబునాయుడు దర్శకత్వంలో రూపొందించిన ఈ నాటక ప్రదర్శనలో చింతామణిగా చాగంటి సాయిలక్ష్మి, భవాని శంకరుడుగా పి.సాయివెంకట్ ప్రదర్శించగా హార్మోనియంపై డాక్టర్ చంద్రబాబునాయుడు, తబలపై కె.వీరబ్రహ్మం వాద్యసహకారాన్ని అందించారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డాక్టర్ ఓలేటి పార్వతీశం హాజరవగా సరస్వతి ఉపాసకులు దైవజ్ఞశర్మ అధ్యక్షత వహించారు. పౌరాణిక నాటకం లేకుంటే రామాయణ, మహాభారతం కథలు ప్రజలకు అందేవి కావన్నారు. కార్యక్రమంలో యువకళావాహిని అధినేత లంక లక్ష్మినారాయణ, హెలెన్ కెల్లర్ సంస్థ అధినేత ఉమర్ ఖాన్, జనహిత చీఫ్ సేల్స్ మేనేజర్ వి.ప్రతాప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ రంగస్థల కళాకారులు పి.సాయివెంకట్, చాగంటి సాయిలక్ష్మి, సత్యనారాయణ, డాక్టర్ చంద్రబాబునాయుడు, వర్ధమాన సినీనటి పూజిత, నస్రీన్‌లను సత్కరించారు.

## మెట్టుగూడలో గుర్తు తెలియని మృతదేహం...

**సికింద్రాబాద్, అక్టోబర్ 17 ప్రభాతవార్త:**

నలభై అయిదు సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని చిలకలగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం ప్రకారం.. మెట్టుగూడ ఆలుగడ్డబావి సమీపంలో రోడ్డుపక్కన పడిఉన్న గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికుల సమాచారం మేరకు స్వాధీనం చేసుకున్నారు. మృతుడి ఒంటిపై పర్పల్ కలర్ షర్ట్, ఆష్ కలర్ ట్రాక్ ప్యాంట్ ధరించి ఉన్నాడు. సంబంధికులు ఎవరైనా ఉంటే చిలకలగూడ పోలీసులను సంప్రదించాలని కోరారు

## గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు నిందితుల అరెస్టు

**సంజీవ్‌రెడ్డి నగర్, అక్టోబర్ 17, ప్రభాతవార్త**



మీడియాకు వివరాలు వెల్లడిసునతన్న ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి

గంజాయి విక్రయిస్తున్న ముగ్గురు వ్యక్తులను ఎస్సార్‌నగర్ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సార్‌నగర్ ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఎస్సార్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నేచర్ క్యూర్ హాస్పిటల్ సమీపంలో గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తుల కదలికలను గమనించి ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి తెలిపారు. మాధవరావు (20), రాకేష్ (23) అలెక్స్ (25) కేశవరావు (23) మాధవరావు, కేశవరావు ఇద్దరు సొంతం అన్నదమ్ములు. మాధవరావు రాకేష్, అలెక్స్ అనే ముగ్గురు స్నేహితులు. మాధవరావు, రాకేష్‌లు హైదరాబాద్‌లోని స్వాతిక రుచులు హోటల్‌లో సర్వీస్ బాయ్స్‌గా పనిచేస్తున్నారు. మాధవరావు సొంతూరు అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరుకు చెందిన మాధవరావు డియో స్కూటీకొని దానికి నెలవారి ఇన్స్టాల్మెంట్ పే చేయడానికి సులభమైన మార్గాన్ని ఎంచుకున్నారు. రాకేష్, మాధవరావులు స్నేహితులు కావటంతో రాకేష్ మాధవరావు పాడేరు సమీపంలో గంజాయి పండిస్తున్నారు. దానిని తీసుకొస్తే చాలు నేను అమ్మిచ్చేస్తానంటూ రాకేష్ హామి ఇచ్చాడు. రాకేష్ హామీ మేరకు మాధవరావు 6.3కిలోల గంజాయిని తెప్పించి అమీర్‌పేట్‌లోని నేచర్‌క్యూర్ హాస్పిటల్ సమీపంలో అమ్మడానికి చూస్తుండగా, విశ్వసనీయ సమాచారం మేరకు ఎస్సార్ నగర్ ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి వారి బృందం అక్కడికి వెళ్లి వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని గంజాయిని స్వాధీనం చేసుకుని, వారిని అరెస్టు చేశారు. ఈ క్రమంలో అలెక్స్ తిప్పించుకున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్స్‌పెక్టర్ శ్రీనాథ్‌రెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సార్‌నగర్ ఇన్స్‌పెక్టర్లు రాజు రాథోడ్, అఖిల, ఎస్ఆర్ నగర్ సిబ్బంది పాల్గొన్నారు.

**GENERAL PUBLIC NOTICE**

General public hereby informed thatmy clients **Sri. A. Devasish S/o Sri. A. Rakesh and Smt. A. Kavitha W/o Sri. A. Rakesh** resident of H.No.1-3-189/39/D1, Talabasthi, Kavadiguda, Hyderabad, are entered into an Agreement of sale to purchase the Ground Floor Flat an extent of 950 sq.ft in Sy.No.171 undivided share of land an extent of 50 sq.yeardss constructed on house bearing Municipal No. 1-3-189/39/D/1, plot No.8, situated at Tallabasthi, Kavadiguda, Hyderabad with Sri. Tushneem Dharmagadda S/o D.Jairaju, r/o Flat No.404 Udayas Siri Residency, Gothami Enclave, Kondapur, K.V. Ranga Reddy Dist, who is absolute owner by virtue of registered Gift Deed vide doc.No.619 of 2023 dated: 09.02.2023 registered at Office of the Chikkedpally SRO. If any person or persons are having any objections in respect of above said property or any person/persons entered into any Agreement of sale prior to our agreement of sale with the above said person shall be informed below mentioned moblile with in fifteen days from the date of publication my clients shall be dropped from sale transaction as otherwise they shall be proceed with sale transaction and get it registered in theirfavour.

**L. SHIVA CHARAN**
**ADVOCATE**
**Mobile: 98495 97344**

